
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ◊ 2 ◊ నవంబర్ ◊ 2024



సోమశిలలో 69.125 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 69.125 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 19,434 క్యూసెక్కుల వరద వస్తోంది. కండలేరుకు 10 వేలు, డెల్టాకు 2100, ఉత్తరకాలువకు 500, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.81,300
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,385
3 శాతం జీఎస్టీతో	రూ.7,607
నవర (8 గ్రా)	రూ.60,856

గరిష్టం/కనిష్టం
33.2 /26.9

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. శుక్రవారం గాలిలో తేమ 70 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జమిలి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కసుమూరులో పర్యటిస్తున్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

వెంకటాచలం: 2026 సంవత్సరంలో జమిలి ఎన్నికలు వస్తాయని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీమంత్రి, ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ప్రమాదానికి గురైన మండలంలోని కసుమూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత పఠాన్ హుస్సేన్, అనారోగ్యానికి గురైన షేక్ ఇలియాజ్, శ్రీరామపురానికి చెందిన రవీంద్రనాయుడు సతీమణి సుధమ్మను శుక్రవారం కాకాణి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 'ఒక దేశం–ఒక ఎన్నికలు' విధానాన్ని ముందుకు తీసుకెళ్తామని ప్రకటించిన నేపథ్యంలో 2026లోనే సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఒక్క తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై పెద్దఎత్తున చర్చ జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమికి మద్దతుగా ఓటు వేసి మోసపోయామని పశ్చాత్తాపం చెందుతున్నారని, అవకాశం వస్తే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలతో మాఫియాలు రాజ్యమేలుతున్నాయే తప్ప, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

నెలనెలా గండం.. పింఛన్ల ఆయుష్షు

జిల్లాలో సామాజిక పింఛన్లపై కూటమి కత్తి వేలాడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే వేలాది మంది పింఛన్లను రద్దు చేసింది. తాజాగా యాభై రోజుల యాక్షన్ ప్లాన్‌తో మరిన్ని పింఛన్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందు కోసం గత ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు ఇచ్చారంటూ పార్టీ నేతలతో పాటు అనుకూల మీడియా ద్వారా వండివార్చే కథనాలతో ప్రజల్లో ప్రచారం చేసేందుకు ముందస్తు ప్లాన్ చేసింది. సామాజిక పింఛన్ల మొత్తాన్ని గత ప్రభుత్వం కంటే పెంచి ఇస్తామంటూ బురిడీ మాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చాక పింఛన్ల భారం తగ్గించుకునేందుకు కోతలకు తెగబడుతోంది.

- కొనసాగుతున్న సామాజిక పింఛన్ల కోతలు
- ఐదు నెలల్లోనే 8,241 మంది తొలగింపు
- జిల్లాలో 50 వేల పింఛన్ల కోత టార్గెట్
- అనర్హత పేరుతో తొలగింపునకు కసరత్తు
- 50 రోజుల యాక్షన్ ప్లాన్‌తో రంగం సిద్ధం
- అనుకూల మీడియాలో అనర్హులంటూ ప్రచారం
- లబ్ధిదారుల ఆందోళన

వేలాడుతున్న కూటమి కత్తి



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు మంకెన దానమ్మ. వయస్సు 55 ఏళ్లు. ఈమెది సీతారామపురం మండలం మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ. ఈమెకు ఎటువంటి పొలం లేదు. వయస్సు పైబడడంతో కూలి పని చేసే పరిస్థితి లేదు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పడంతో తనకు పింఛన్ వస్తుందని ఆనంద పడింది. కానీ ఐదు నెలలు గడిచినా ఇంత వరకు ఆ ఊసే లేదు. కనీసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఇంకా ఇవ్వలేదు.



సర్వర్ పని చేయకపోవడంతో నెల్లూరు హరనాథపురం సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి ఉన్న మహిళలు

ఉదయగిరి: సామాజిక పింఛన్ల పరిస్థితి 'నెలనెలా గండం.. పింఛన్ల ఆయుష్షు'గా మారింది. ఏ నెలకు ఆ నెల పింఛన్ చేతికందే వరకు అవ్వా, తాతలు, దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హమ్మయ్యా.. ఈ నెల గండం గడిచిందంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. మోసం, దగా, వంచకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలు గుప్పించడం.. పీఠమెక్కగానే ప్రజల పీకపై కత్తి పెట్టడం ఆయన నైజం. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. రాష్ట్రం శ్రీలంక అయిపోతుందంటూ ప్రచారం చేసిన చంద్రబాబు అండ్ కో.. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం కంటే మిన్నగా పథకాలు అమలు చేస్తానంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా.. సంక్షేమ పథకాల ఊసే పట్టించుకోలేదు. కానీ పింఛన్ పథకం కోతకు పదును పెడుతున్నారు. ఒక వైపు కొత్త పింఛన్లకు దరఖాస్తులు తీసుకుంటామని చెబుతూనే, మరో వైపు అనర్హుల పేరుతో కోత పెట్టేందుకు 50 రోజుల ప్రణాళికను సిద్ధం చేస్తూ చంద్రబాబు మార్క్ పాలనకు తెరలేపారు.


ఐదు నెలల్లో 8,241 పింఛన్ల తొలగింపు

చంద్రబాబు ఎన్నికలకు ముందు అధికారం కోసం ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని ప్రచార సభల్లో హామీలు గుప్పించారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ పింఛన్ల అంటూ ఊరించారు. అధికారం చేపట్టిన ఐదు నెలలు అవుతోంది. కొత్త పింఛన్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న వాటిని గుట్టుగా తొలగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే జిల్లా వ్యాప్తంగా 8,241 పింఛన్లను తొలగించారు. అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర పింఛన్లదార్లు గుండెల్లో గుబులు మొదలైంది. ప్రస్తుతం ఉన్న పింఛన్లు అడ్డగోలుగా తొలగించేందుకు కసరత్తు మొదలైంది. నవంబరు నెలలో కొత్త పింఛన్ల దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఉన్న పింఛన్లలో అనర్హత పేరుతో తొలగించేందుకు కేబినెట్ పచ్చ జెండా ఊపింది. జిల్లాలో నవంబర్ నెలలో 3,08,759 మందికి పింఛన్లు అందించారు. డిసెంబర్ నాటికి కనీసం 50 వేల వరకు పింఛన్లు తగ్గించాలని జిల్లా అధికారులకు టార్గెట్ విధించినట్లు సమాచారం. ఇందు కోసం ముందుగానే గత ప్రభుత్వ హయాంలో వేలాది మంది అనర్హులకు పింఛన్ల ఇచ్చారంటూ తమ పార్టీ నేతల ద్వారా, ప్రభుత్వ అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేయాలని ముందుస్తు ప్లాన్ చేస్తోంది.

50 ఏళ్లకే పింఛన్ల ఇస్తే.. మరో 70 వేల మంది అర్హులు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో 50 ఏళ్లకే పింఛన్ల ఇస్తామన్న హామీ ఊసే లేదు. ఈ కేటగిరీల్లో సుమారు 70 వేల మంది అర్హులు ఉండే అవకాశం ఉందని అధికారుల అంచనా. రోజులు, నెలలు గడుస్తున్నా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో సచివాలయాలు, మండల, డివిజన్ స్థాయిలో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఏకంగా కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు కూడా పెద్ద సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 50 వేల వరకు కొత్త పింఛన్లకు అర్జీలు వచ్చినట్లు సమాచారం.







బయోమెట్రిక్ నమోదు చేస్తున్న దృశ్యం (ఫైల్)

గత ప్రభుత్వంలో పారదర్శకంగా పింఛన్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రాతిపదికగా ఏడాదికి రెండుసార్లు జనవరి, జూలైలో పార్టీలకు అతీతంగా కొత్త పింఛన్ల మంజూరు చేసేసింది. ఇందులో రాజకీయ నేతల జోక్యం లేకుండా వలంటీర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, సచివాలయ సిబ్బంది ద్వారా మంజూరు చేసింది. 2019లో టీడీపీ అధికారం కోల్పోయే నాటికి జిల్లాలో 2.30 లక్షల పింఛన్లు మాత్రమే ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారం నుంచి దిగిపోయే నాటికి 3.17 లక్షల పింఛన్లు ఉన్నాయి. అంటే టీడీపీ ప్రభుత్వంలో కంటే దాదాపు 87 వేల పింఛన్ల జగన్ ప్రభుత్వంలో అధికంగా ఉన్నాయి. ఈ ఐదేళ్లలో లబ్ధిదారుల్లో మృతుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే.. దాదాపు లక్షకు పైగా పింఛన్లు పెరిగాయని అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి కాకాణిపై పోలీసులకు ఫిర్యాదు

వెంకటాచలం: మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై టీడీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమనాయుడు, పలువురు నాయకులు కలిసి శుక్రవారం వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ 18వ తేదీన తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కాకాణి ప్రెస్‌మీట్ పెట్టి సీఎం చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు చేశారని నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. చంద్రబాబు గౌరవానికి భంగం కలిగించారన్నారు. ప్రెస్‌మీట్‌లో వెల్లడించిన వివరాలు 19వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైతే వాటిని సోషల్ మీడియా గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారన్నారు. వంద రోజుల పాలనపై అసత్య ప్రకటనలు చేసిన కాకాణిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు 30 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని సివిల్ సప్లయీస్ సంస్థ డీఎం నర్సింహరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 37,978 ఎకరాల్లో వరి సాగు చేశారని, 1,29,583 టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖాధికారులు నివేదికలు ఇచ్చారన్నారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం 2024–25 సీజన్‌కు గ్రేడ్ ఏ రకానికి క్వింటా రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరగా ప్రకటించిందన్నారు. జిల్లాలోని రైతులకు మద్దతు ధర తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతామని తెలిపారు. ధాన్యం విక్రయాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు 85208 79979 ఫోన్ నంబర్‌లో రైతులు సంప్రదించాలని కోరారు.

అగ్నిమాపక శాఖ సిబ్బందిపై చర్యలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు వీఆర్సీ గ్రౌండ్‌లో గతనెల 30వ తేదీన నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు చేసిన నెల్లూరు లీడింగ్ ఫైర్‌మెన్ నారాయణను వింజమూరు ఫైర్‌స్టేషన్‌కు అటాచ్ చేస్తూ డీఎఫ్ఓ వాకా శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

కేజీబీవీల్లో ఖాళీ పోస్టుల భర్తీ



పోస్టింగ్ ఆర్డర్ అందజేస్తున్న ఏపీసీ

నెల్లూరు (టౌన్): జిల్లాలోని 12 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ జరిగింది. విల్లింగ్ తెలిపిన వారికి పోస్టింగ్ ఉత్తర్వులను ఏపీసీ ఉషారాణి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 31 ఖాళీ పోస్టులకు 498 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 217 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా 28 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరిలో 15 విల్లింగ్ తెలపగా 10 మంది నాట్ విల్లింగ్ తెలిపారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. మరో 3 పోస్టులకు క్వాలిఫైడ్ అభ్యర్థులు లేకపోవడంతో ఆ పోస్టు భర్తీని వాయిదా వేశారు. ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలన్నారు. అలాంటి వారే పోస్టింగ్ ఆర్డర్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ మమత పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



రామయ్య మృతదేహం

ఉదయగిరి: పట్టణంలోని యాదవవీధికి చెందిన పల్లపు రామయ్య (31) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. రామయ్య తల్లి జయమ్మతో కలిసి ఉంటున్నాడు. అతను పనికి వెళ్లడు. నగదు కోసం రోజూ తల్లిని వేధించేవాడు. ఆమె ఎన్నిసార్లు చెప్పినా రామయ్య ప్రవర్తనలో మార్పు రాలేదు. జయమ్మ పింఛన్ నగదు తీసుకునేందుకు స్వగ్రామమైన యర్రబల్లిగడ్డ బీసీ కాలనీకి గురువారం వెళ్లింది. శుక్రవారం ఇంటికి తిరిగొచ్చి చూడగా కుమారుడు ఉరేసుకుని కనిపించాడు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 137
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 270
లేయర్ చికెన్ : 187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.50
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20

దీపావళి సంబరం



చిచ్చుబుడ్డి వెలుగులు



బాలిక చేత టపాసులు కాల్పిస్తూ..

జిల్లా వ్యాప్తంగా గురువారం దీపావళి పండగను ప్రజలు ఆనందంగా జరుపుకొన్నారు. మహిళలు ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు. చిన్నా, పెద్దా కలిసి సాయంత్రం బాణసంచా కాల్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఇంటిల్లిపాది సంతోషంగా..



టపాసులు కాలుస్తూ..

సైబర్ నేరం.. అవగాహనతోనే దూరం

రెచ్చిపోతున్న నేరగాళ్లు

- కొత్త తరహాలో నగదు దోచేస్తున్న వైనం
- ఈ ఏడాదిలో నమోదైన కేసులు 52
- జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన సదస్సులు

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కొత్త తరహాలో నేరాలను పాల్పడుతున్నారు. బాగా చదివి ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారే అధికంగా మోసపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాదిలో 52 కేసులు నమోదయ్యాయి. బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా వివిధ కారణాలతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం లేదు. సైబర్ నేరం అవగాహనతోనే దూరం అన్న నినాదంతో జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ ఫోన్ నంబర్ 1930కు, ఆర్థిక నేరాలకు సంబంధించి 155260కు, సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌లకు ఫిర్యాదు చేయాలని సూచిస్తోంది.

డ్రగ్స్, మారణాయుధాలున్నాయంటూ..

ముంబైలోని కొరియర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేస్తారు. మీ పేరుతో విదేశాల నుంచి పార్శిల్ వచ్చింది. అందులో మాదకద్రవ్యాలు, ఆయుధాలున్నాయని చెప్పి హడలెత్తిస్తారు. అదే సమయంలో ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలను తెలుసుకుని ముంబై సైబర్‌క్రైమ్/నార్కొటిక్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఫోన్ కట్ చేస్తారు. కొద్దిసేపటికి ముంబై సైబర్‌క్రైమ్ పోలీసు విభాగం నుంచి ఫోన్ చేస్తున్నామని మరో వ్యక్తి నుంచి కాల్ వస్తుంది. మిమ్మల్ని ఓ హోటల్ రూమ్ లేదా ఇంట్లోనే ఓ గదిలో ఒంటరిగా ఉంటే విచారణ చేపడతామని నమ్మిస్తారు. అనంతరం వీడియో కాల్లో మాట్లాడుతూ మీ వ్యక్తిగత సమాచారం మొత్తం లాగేస్తారు. కేసు నుంచి బయటపడాలంటే తాము చెప్పినంత మొత్తం చెల్లించాలని లేదంటే అరెస్ట్ తప్పదని భయపెడతారు. వారు అడిగినంత ఖాతాలో జమయ్యాకే వదులుతారు. ఇలా మనిషిని ఎటూ వెళ్లకుండా నిర్బంధించడమే డిజిటల్ అరెస్ట్.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారి

ఈడీ అధికారులమంటూ..

ఈడీ అధికారులమంటూ ఫోన్ చేసి మనీల్యాండరింగ్‌కు పాల్పడ్డారని చెబుతారు. వ్యక్తిగత, బ్యాంక్ ఖాతాలో ప్రస్తుతం ఉన్న నగదు వివరాలు పూసగుచ్చినట్లు చెప్పి నమ్మేలా చేస్తారు. అప్పటికి నమ్మకపోతే వీడియో కాల్ చేసి తాము అడిగినంత ఇవ్వకపోతే అరెస్ట్ చేస్తామని బెదిరించి అందినకాడికి దోచేస్తారు.

ఏం చేయాలంటే..

మోసాగాళ్లు చెప్పేవన్నీ నిజమని భావించొద్దు. డిజిటల్ అరెస్ట్‌లు లేవు. సీబీఐ, నార్కొటిక్స్, ఈడీ నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా చెబితే కచ్చితంగా అనుమానించాల్సిందే. ఏ దర్యాప్తు సంస్థ కూడా వీడియోకాల్లో విచారణ చేయదు. నేరుగా వచ్చి మాట్లాడతారు. మోసపూరిత కాల్ వస్తే సమీప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.



ట్రాయ్ పేరిట

మీ మొబైల్ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు ఉపయోగించబడిందని టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నుంచి కాల్ చేస్తున్నామని చెబుతారు. మీ ఫోన్ నంబర్ సేవలను నిలిపివేస్తున్నామని, దీనిపై సైబర్ క్రైమ్ పోలీసుల విచారణ సాగుతోందంటూ కాల్‌ను మోసగాళ్లకు ఫార్వర్డ్ చేస్తారు. సదరు మోసగాడు వ్యక్తిగత వివరాలతోపాటుగా బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలను సేకరించి ఖాతాను ఖాళీ చేస్తారు.

క్రెడిట్ కార్డు స్కామ్

ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డ్ స్కామ్‌లు అధికమయ్యాయి. బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం. మీ క్రెడిట్ కార్డుల్లో పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగాయని, దానికి సంబంధించి వెరిఫికేషన్ చేయాలని నమ్మిస్తారు. కార్డు వివరాలు, సీవీవీ, ఓటీపీ తెలుసుకుని అకౌంట్ ఖాళీ చేస్తారు.

➡ మీ పేరుపై క్రెడిట్ కార్డు జారీ చేయబడితే లావాదేవీలకు సంబంధించి ప్రతి వివరాలు ఎస్ఎంఎస్ రూపంలో వస్తాయి. బ్యాంక్‌ల నుంచి కాల్ చేస్తున్నాం, కార్డు వివరాలు, సీవీవీ, ఓటీపీ చెప్పమని అడిగేవారు నకిలీ అనే విషయాన్ని గుర్తించండి.

➡ ట్రాయ్ మీ మొబైల్ నంబర్ సేవలను డిస్‌కనెక్ట్ చేయడం జరగదు. టెలికామ్ కంపెనీలచే డిస్‌కనెక్ట్ చేయబడుతుందన్న విషయాన్ని గమనించాలి.

ట్రేడింగ్ పేరుతో..

ట్రేడింగ్‌ల్లో పెట్టుబడులు పెట్టండి. కళ్లు చెదిరే ఆదాయం పొందండంటూ సోషల్ మీడియా ప్రకటనల ద్వారా ఆకర్షిస్తారు. మిమ్మల్ని నకిలీ వెబ్‌సైట్‌కు మళ్లించి నకిలీ పోర్ట్‌ఫోలియో చూపిస్తారు. స్కామర్లు తొలుత తక్కువ మొత్తంలో చాలా ఎక్కువ రాబడి ఇచ్చి మిమ్మల్ని మరింత పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారు. తర్వాత పెట్టుబడుల విత్‌డ్రాకి ప్రయత్నించినప్పుడు అందుబాటులో ఉండరు.

➡ ఎక్కువ ఆదాయం అందించే పథకం స్కామ్ అన్న విషయాన్ని గమనించాలి. వాటి జోలికి ఎలాంటి పరిస్థితుల్లో వెళ్లరాదు.

టాస్క్ మోసాలు

యూట్యూబ్ వీడియోలు లేదా సోషల్ మీడియా పోస్టులకు లైక్ చేయడం ద్వారా అధిక మొత్తంలో నగదు పొందవచ్చని ఆశ చూపిస్తారు. అధిక రాబడి కోసం క్రిప్టోస్ లేదా ఇతర వాటిలో పెట్టుబడి పెట్టమని అడుగుతారు. నమ్మకం కల్పించడానికి మీకు కొంత మొత్తం డిపాజిట్ చేస్తారు. మీచేత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టించి జారుకుంటారు.

➡ సులభంగా డబ్బు అందించే పథకాలు కచ్చితంగా మోసపూరితమైనవి. వాటిని చూసి మోసపోరాదు.

రూరల్ నియోజకవర్గంలో ఇష్టారాజ్యం

- యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- టీడీపీ నేతల నిర్వాకం

నెల్లూరు సిటీ: అనుమతులు, నిబంధనలతో నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ నేతలకు పని లేదు. ప్రకృతి వనరులను కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఇసుక, గ్రావెల్‌ను తవ్వి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో రాత్రి సమయంలో అక్రమంగా రవాణా చేసేవారు. అయితే ఇప్పుడు ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు.

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కొమరపూడి గ్రామం సమీపంలోని కొండ పొలాలు, డీకేటీ పట్టా భూముల్లో రెండు రోజులు నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అనుమతులు లేకుండా ఈ వ్యవహారాన్ని టీడీపీ నేతలు దగ్గరుండి నడిస్తున్నారు. రోజుకు సుమారు 50 టిప్పర్లలో నెల్లూరు నగరానికి తరలిస్తున్నారు. కొమరపూడి ప్రాంతం నుంచి టిప్పర్లు వేగంగా నగరం వైపు రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయం గుప్పెట్లో బతుకుతున్నారు. రెండు రోజుల ఉదయం సమయంలో గ్రావెల్ తవ్వకాలు జరిపి అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. పోలీసులు సైతం టీడీపీ నేతల ఒత్తిళ్లతో మిన్నకుండిపోయారని తెలుస్తోంది.



టిప్పర్‌లో గ్రావెల్ తరలిస్తూ..

తెలుగు తమ్ముళ్ల మధ్య ఘర్షణ

- ఆనందపురంలో ఉద్రిక్త వాతావరణం

కందుకూరు: తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాల మధ్య గురువారం రాత్రి ఘర్షణ జరగడంతో ఆనందపురం గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురంలో టీడీపీలో రెండు వర్గాలున్నాయి. వీటిలో ఏఎంసీ మాజీ చైర్మన్ తల్లపనేని వెంకటేశ్వర్లు ఒక వర్గంగా, అదే గ్రామానికి చెందిన తల్లపనేని మురళి, రవి ఇతరులు మరో వర్గంగా కొనసాగుతున్నారు. వీరి మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ క్రమంలో గ్రామంలో పనులు ఇతరత్రా వ్యవహారాల్లో మురళి, రవి వర్గానికే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మద్దతు తెలుపుతున్నారు. వ్యక్తిగత పనులపై గురువారం రాత్రి కందుకూరుకు వచ్చిన వెంకటేశ్వర్లు తిరిగి ఇంటికి వెళ్తుండగా అటకాయించిన మురళి, రవి తదితరులు అతడిపై దాడి చేశారు. తీవ్రంగా కొట్టడమే కాకుండా దాడి ఈ ఘటనను సెల్‌ఫోన్‌ల్లో వీడియోలు తీసినట్లు సమాచారం. అనంతరం ఈ దాడి విషయం గ్రామంలోని వెంకటేశ్వర్లు మనుషులకు తెలియడంతో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు గ్రామానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

చెట్టు కొమ్మ పడి మహిళ మృతి

సంగం: చెట్టు కొమ్మ పడి మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని మర్రిపాడు ఎస్టీ కాలనీలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎస్టీ కాలనీలో ప్రసన్నకుమార్ అనే వ్యక్తి జామాయిల్ చెట్టు కొడుతున్నాడు. అదే సమయంలో అక్కడ పూరింట్లో ఉంటున్న ఈగా చెంచమ్మ (58) బయటికొచ్చి నిలబడింది. చెట్టు కొమ్మ ఆమెపై పడగా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్సై రాజేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ముత్తుకూరుగేటు సెంటర్ సర్వేపల్లి కాలువకట్టకు చెందిన వాకా అశోక్ కూరగాయల మార్కెట్‌లో పని చేసేవాడు. గతనెల 15వ తేదీ తెల్లవారుజామున అతను మార్కెట్‌లో పనులు ముగించుకుని ఎదురుగా టిఫిన్ బండి వద్దకెళ్లాడు. అతడికి పరిచయస్తులైన పాతనేరస్తులు జేమ్స్‌గార్డెన్‌కు చెందిన జి.రాము, ఉడ్‌హౌస్‌సంఘానికి చెందిన పి.సందీప్‌లు అక్కడికి వచ్చారు. వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రాము కత్తితో అశోక్‌పై దాడి చేశాడు. అనంతరం నిందితులిద్దరూ పరారయ్యారు. అశోక్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ అదేరోజు మృతిచెందాడు. హత్య కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గతనెల 22న సందీప్‌ను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన రామును శుక్రవారం బోడిగాడితోట వద్ద అరెస్ట్ చేశారు. అశోక్‌పై పలు స్టేషన్లలో కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులో, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరులో ప్రారంభించారు. ఇంకా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

బస్సు దహనం కేసులో ఒకరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): యజమానిపై కక్ష పెంచుకుని బస్సును దహనం చేసిన కేసులో నిందితుడిని నెల్లూరు సంతపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. వేదాయపాళెం రైల్వేగేటు సమీపంలో నివాసముంటున్న శ్రీనివాసులురెడ్డి కామాక్షి ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. ఆయన వద్ద వెంకటేశ్వరపురానికి చెందిన గౌస్‌బాషా డ్రైవర్‌గా చేరాడు. ఈ ఏడాది మొదట్లో గౌస్ నడుపుతున్న బస్సు ప్రమాదానికి గురికావడంతో అతడిని పని నుంచి తొలగించాడు. అప్పటి నుంచి గౌస్ యజమానిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం సింహపురి హోటల్ సమీపంలో పార్క్ చేసి ఉన్న బస్సును తగులబెట్టాడు. ఈ మేరకు శ్రీనివాసులురెడ్డి అల్లుడు మనోజ్‌కుమార్ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై బాలకృష్ణ శుక్రవారం నిందితుడిని బోసుబొమ్మ వద్ద అరెస్ట్ చేశారు. ఇది ఇలా ఉంటే యజమాని కారు దహనం కేసులో వేదాయపాళెం పోలీసులు గౌస్‌బాషాపై బుధవారం రాత్రే కేసు నమోదు చేశారు. ఆ కేసులో అరెస్ట్ చేయాల్సి ఉంది.